క్లుప్తంగా

మంత్రులకు ఘన స్వాగతం



మంత్రి శ్రీధర్ బాబుకు మొక్క అందజేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం సమీపంలోని తోసిబా పరిశ్రమలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన యూనిట్‌ను ఐటీ మంత్రి శ్రీధర్ బాబు, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జ్, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులకు కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్ ఘన స్వాగతం పలికారు.

ఉపాధి హామీ పనులపై సమీక్ష



మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీబాలాజీ

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో శుక్రవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీబాలాజీ హాజరై మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నిలిచిన పనులను తిరిగి ప్రారంభించాలని సూచించారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. అలాగే రైతులు పండ్ల తోటలను సాగు చేసుకొనేందుకు సహకారం అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో డీఈఓ నాగేశ్వర్‌రావు, ప్లాంటేషన్ మేనేజర్ మాణిక్‌కుమార్, ఏపీఓ అశోక్‌కుమార్, ఏపీఓలు, టీఏలు, సీఓఎస్‌లు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు పనులు



గుంతలను పూడ్చి వేయిస్తున్న భాస్కర్‌రెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని అల్లాదుర్గం–మెటల్‌కుంటతోపాటు రుక్మాపూర్, ముంగి, హద్నూర్ రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి. అయితే ప్రయాణికుల ఇబ్బందులను దృష్ట్యా డీసీసీ ప్రధాన భాస్కర్‌రెడ్డి రోడ్డు మరమత్తులు చేపట్టారు. సొంత డబ్బుతో రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో ఇసుక, కంకర వేయించి గుంతలను పూడ్చి వేయిస్తున్నారు. దీంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.2.50 లక్షల ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నిరుపేదలకు సీఎం సహాయనిధి వరప్రదాయనిగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని మాదారం గ్రామానికి చెందిన స్వప్న గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ మేరకు మెరుగైన వైద్య చికిత్స కోసమని ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని శుక్రవారం క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు యూరియా, ఎరువుల పంపిణీ



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్: రైతులు యూరియా, ఎరువుల కోసం ఆందోళన చెందవద్దని, అవసరం మేరకు సరఫరా చేయనున్నట్లు ఏడీఏ భిక్షపతి అన్నారు. శుక్రవారం మొగుడంపల్లి మండలంలోని ఇప్పపల్లి పీఏసీఎస్‌లో రైతులకు యూరియా, ఎరువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిమాండ్ ఆధారంగా ఎరువులను దిగుమతి చేసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మచ్చేందర్, ఏఓ లావణ్య, ఏఈఓలు పాల్గొన్నారు.

వరలక్ష్మీ.. దీవించమ్మా!

భక్తిశ్రద్ధలతో మహిళల పూజలు

వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ మేరకు మహిళలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. పలు ఆలయాల్లో బంగారు చీరతో విశేష అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే మహిళలు ఇండ్లల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పరచుకొని వివిధ రకాల పూలు, పండ్లు, ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి వాయినాలు ఇచ్చుకున్నారు. శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీవ్రతం ఆచరిస్తే అమ్మవారు కరుణించి కోరిన వరాలిస్తారని, సౌభాగ్యం అందజేస్తారని భక్తుల విశ్వాసం.



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు



సంగారెడ్డిటౌన్: వరలక్ష్మి వ్రతంలో మహిళలు



దత్తాచల క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తున్న మహిళలు



సదాశివపేట: కన్యకపరమేశ్వరీదేవి మందిరంలో వరలక్ష్మి వ్రతం ఆచరిస్తున్న మహిళలు



జహీరాబాద్ : మాణిక్‌ప్రభు పాఠశాలలో సామూహికంగా నిర్వహించిన వరలక్ష్మి వత్రం



రామచంద్రాపురం: పూజల్లో కార్పొరేటర్ సింధు రెడ్డి



జిన్నారం: కుంకుమార్చనలు నిర్వహిస్తున్న మహిళలు



సంగారెడ్డి: మహా లక్ష్మి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు



సంగారెడ్డి: వ్రతం చేస్తున్న మహిళ



సంగారెడ్డి: వాయినం ఇచ్చుకుంటున్న మహిళలు



సంగారెడ్డి: లక్ష్మీదేవికి హారతి ఇస్తున్న మహిళలు

వైభవంగా సామూహిక లక్ష బిల్వార్చన

సదాశివపేట(సంగారెడ్డి): మండలంలోని జగద్గురు పంచాచార్య బసవ సేవాసదన్‌లో కాశీ పీఠాధిపతి డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహాస్వామి 79వ జన్మదినోత్సవం సందర్భంగా శుక్రవారం సామూహిక లక్ష బిల్వార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మంగళస్నానం, మహిళలతో 79 కలశ జలంతో పాదాభిషేకం, సామూహిక ఇష్ట లింగార్చన పాదపూజ విశ్వనాథ్‌శాస్త్రీ ఆధ్వర్యంలో అర్చకులు చేసిన 79 జ్యోతులను వెలిగించారు. అనంతరం భక్తులు జగద్గురువు చంద్రశేఖర శివాచార్యస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శివాచార్యులు గురు సిద్ద మణికంఠ, జ్ఞానసిద్ధ ఓంకార్ శివాచార్య మహాస్వామి, మల్లికార్జునస్వామి, వేదాగామ పాఠశాల ప్రధానాచార్యులు సంగయ్యస్వామి, అర్చకులు మహేశ్ స్వామి, నాగయ్య, విజయస్వామి, చౌకిమఠం అధ్యక్షుడు మల్లన్న, ఉపాధ్యక్షుడు విజయకుమార్, ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, సభ్యులు బస్వరాజ్, రాములు, భక్తులు పాల్గొన్నారు.



బసవ సేవాసదన్‌లో లక్ష బిల్వార్చన

నూతన కమిటీ ఎన్నిక

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా గ్రామపంచాయతీ యూనియన్ కార్యదర్శి దశరథ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనియన్ మండల అధ్యక్షుడిగా వెంకయ్య, ఉపాధ్యక్షుడిగా సంజీవులు, కార్యదర్శిగా విజేందర్, సహాయ కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా రవి ఎన్నికయ్యారు.

పౌరసరఫరాల గోడౌన్ తనిఖీ

నారాయణఖేడ్: ఖేడ్ మండలంలోని జూకల్ శివారులో ఉన్న పౌరసరఫరాల గోడౌన్‌ను విజిలెన్స్ అధికారులు శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ పండరి, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, సాంబశివరావు, తహసీల్దార్ ప్రభాకర్‌లు పౌర సరఫరాల గోడౌన్‌లో నిల్వ ఉన్న బియ్యం వివరాలతో పాటు పాఠశాలలు, హాస్టళ్లకు, చౌక ధరల దుకాణాలకు సరఫరాల చేసిన రికార్డులను పరిశీలించారు. కాగా, ఖేడ్ పౌరసరఫరాల గోడౌన్ ఇన్‌చార్జీగా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న హరిబాబు బదిలీ అయ్యారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు

మునిపల్లి(అందోల్): ఓపెన్ స్కూల్ ప్రవేశాలు ప్రారంభమయ్యాయని ఎంఈఓ భీంసింగ్ శుక్రవారం తెలిపారు. 2025–26 ఏడాదికి సంబంధించి 14 ఏండ్లు నిండిన విద్యార్థులు పదో తరగతిలో ప్రవేశం పొందేందుకు అవకాశం ఉందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి కనీస వయస్సు 15 ఏండ్లు ఉండాలన్నారు. పదో తరగతికి ఫీజు రూ.1,150, ఇంటర్మీడియట్‌కు రూ.1,500 రుసుం కట్టాల్సి ఉంటుందన్నారు. మునిపల్లి, కంకోల్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, రికార్డ్ షీట్, లేటెస్ట్ పాస్ ఫొటోలతో దరఖాస్తు ఫారానికి జతచేయాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రోగులకు పండ్లు పంపిణీ

జహీరాబాద్ టౌన్: ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదినం సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ నాయకులు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అంతకుముందు సుభాష్ గంజ్‌లో గల పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నరేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింలు, నాయకులు భాస్కర్ రెడ్డి, వర్ధన్‌రెడ్డి, ఖాజామియా, రాములు, మోతీరాం, శ్రీనివాస్‌నాయక్, వంశీ పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్: జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు రాజీవ్ చౌక్ వద్ద కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

జహీరాబాద్‌లో..

జహీరాబాద్: మండల కేంద్రంలో ఎంపీ సురేష్‌కుమార్ శెట్కార్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, ఎంపీ క్యాంప్ కార్యాలయాల్లో కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి శుక్లవర్ధన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నాయకులు అశోక్‌కుమార్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌నాయక్, నరేష్‌గౌడ్, శ్రీనివాస్ నాయక్, నర్సింహులు, ఖాజామియా, వంశీ, రాములు నాయక్, సుభాష్‌రెడ్డి, గుండ్‌రెడ్డి, జమీల్ అహ్మద్, భీమయ్య, మోతిరాం, జహంగీర్, యూనూస్, ప్రేమ్‌రాథోడ్, విష్ణు, అక్రం, ఇనాయత్, ముర్జల్, అతిక్, సొహాయిల్, బర్కత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **నేడు సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం**

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్‌లో గల సంతోషిమాత ఆలయ వార్షికోత్సవాన్ని ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు అమ్మవారికి అభిషేకం, 10 గంటలకు సామూహిక కుంకుమార్చన, 11 గంటలకు పల్లకీసేవ ఊరేగింపు, మధ్యాహ్నం 12.10 గంటలకు డోలారోహణం, 12.30 గంటలకు మహా మంగళ హారతి, లలితా సహస్రనామ పారాయణ, అన్నదానం ఉంటుందన్నారు. రాత్రి 9 గంటలకు భజన ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

◆ **అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి**

నారాయణఖేడ్: అంబేడ్కర్ ఆశయసాధనకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కార్యదర్శి అనుముల తుకారాం అన్నారు. ఖేడ్ మండలంలోని మాద్వార్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ ఆలోచనలు, సిద్ధాంతాలు ప్రతీ పౌరుడికి సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం సాధించడానికి దోహదపడుతున్నాయన్నారు. అనంతరం మాద్వార్ గ్రామసంఘం అధ్యక్షుడిగా నాగయ్యను ఎన్నుకున్నారు.

◆ **నైపుణ్యాభివృద్ధితో ఉపాధికి బాటలు**

పటాన్‌చెరు: నైపుణ్యాభివృద్ధితో పాటు ఆచరణాత్మక పారిశ్రామిక శిక్షణతో మంచి ఉపాధి అవకాశాలను పొందవచ్చని కేంద్ర ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. మండలంలోని రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని కెరీర్ గైడెన్స్ కేంద్రం, ఫుడ్ ఇండస్ట్రీ కెపాసిటీ అండ్ స్కిల్ ఇనిషియేటివ్ సహకారంతో శుక్రవారం అప్రెంటిస్ షిప్ అవగాహన వర్క్ షాప్ నిర్వహించాయి. ఈ సందర్భంగా ఆర్డీ ఎస్డీఈ అధికారి వీవీ సతీష్ రెడ్డి జాతీయ అప్రెంటిస్ షిప్ శిక్షణ పథకం వివరాలను వెల్లడించారు. పట్టభద్రులు, డిప్లొమా పూర్తిచేసిన వారికి కావాల్సిన నైపుణ్యాలను అందిస్తుందన్నారు. ఈ శిక్షణతో విద్యా పరిజ్ఞానం, కార్యాలయ అవసరాల మధ్య అంతరాయం తగ్గుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

భారీ వర్షం.. అతలాకుతలం

- రోడ్లు, కాలనీలు జలమయం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పలుచోట్ల నేలకూలిన స్తంభాలు, చెట్లు



కొన్యాలలో నేలకూలిన విద్యుత్ స్తంభం

హత్నూర(సంగారెడ్డి): మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడ్డాయి. కొన్యాల గ్రామ శివారులో 11 కేవీ విద్యుత్ లైన్ 4 తెగిపడింది.అలాగే, చింతల్ చెరువు నవాబుపేట గ్రామాల శివారులో విద్యుత్ లైన్లు, ఆరు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. మధుర గ్రామ శివారులోని పశువుల షెడ్డు పైకప్పు రేకులు ధ్వంసమవ్వగా.. కొన్యాల, మధుర, చింతలచెరువు, నవాబుపేట తదితర గ్రామాలలో చెట్లు నేలకూలాయి. అయితే విద్యుత్ అంతరాయం కలగకుండా మరమ్మతులు చేపట్టినట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ రాఘవ సాయి తెలిపారు.

వాహనదారుల ఇక్కట్లు..

రామచంద్రాపురం (పటాన్‌చెరు): పట్టణంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలిచింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు శుక్రవారం జాతీయ రహదారిపై నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. అధికారులు రోడ్లపై నీళ్లు నిల్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాలల్లో ముందస్తు ‘రక్షాబంధన్’



ఆర్‌ఎల్ఆర్ స్కూల్‌లో రాఖీ కడుతున్న చిన్నారులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో శుక్రవారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎల్ఆర్, మాణిక్‌ప్రభు స్కూల్, సిద్దార్థ హైస్కూల్, భవన, నారాయణ హైస్కూల్‌లలో తోటి విద్యార్థులకు రాఖీలు కట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఆర్ స్కూల్ హెచ్ఎం కవిత పాల్గొన్నారు.

నిజాంపూర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో..

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని నిజాంపూర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తోటి విద్యార్థులకు రాఖీ కట్టి ముందస్తుగా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా అన్నాచెల్లెల అనుబంధంపై ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సునీత, నవనీత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రాఖీ కడుతున్న విద్యార్థిని

శాంతినికేతన్ పాఠశాలలో..

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని శాంతినికేతన్ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ప్రిన్సిపాల్ అరవిందశ్రీకి ఉపాధ్యాయులు, సిబ్బందికి రాఖీలు కట్టారు. అనంతరం విద్యార్థులు రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



పాతటైర్లల్లో నిల్వ నీటిని తొలగిస్తున్న సిబ్బంది

నారాయణఖేడ్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ×శుక్రవారం.. పరి శుభ్రవారం× కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శానిటరీ అధికారి శ్రీనివాస్ సిబ్బందితో కలిసి 9వ వార్డులో పర్యటించారు. ఈ మేరకు పాతటైర్లు, పూలకుండీలు, కూలర్లలో నీరు నిల్వ ఉంటే లార్వా, దోమలు వ్యాప్తించి డెంగ్యూ, మలేరియా వ్యాధులకు కారణం అవుతాయని వివరించారు. అందుకే నీటిని నిల్వ ఉంచకుండా పారబోయాలని సూచించారు. పలు కాలనీల్లో వందరోజుల ప్రణాళికలో భాగంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు.

ప్రయాణికులకు ఇబ్బంది కలిగించొద్దు

నారాయణఖేడ్: ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా గమ్యస్థానాలకు చేర్చడమే ఆర్టీసీ సంస్థ లక్ష్యమని ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రాజీవ్ చౌక్ సమీపంలో బస్టాప్ వద్ద ఆర్టీసీ పర్యవేక్షణ కమిటీ పనితీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో మాట్లాడి ఆర్టీసీ అందిస్తున్న సేవల పనితీరును తెలుసుకున్నారు. ఖేడ్ నుంచి లింగంపల్లి, పటాన్‌చెరు, సికింద్రాబాద్ వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడుతున్నామని వివరించారు. ఆయనవెంట అసిస్టెంట్ డీఎం నర్సింహులు, పీఆర్వో పాండు ఉన్నారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఎం మల్లేశయ్య

సిగాచి యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి



సిగాచి బాధిత కుటుంబాలకు మద్దతుగా రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

సంగారెడ్డి ఎడ్యుకేషన్: ప్రమాదంలో 54 మంది కార్మికుల మృతికి కారణమైన సిగాచి పరిశ్రమ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని, ఈ విషయంలో ప్రభుత్వం ఎందుకు అలసత్వం ప్రదర్శిస్తోందో సమాధానం చెప్పాలని సీపీఎం జిల్లా కార్యదరిశ్ జయరాజు ప్రశ్నించారు? ప్రమాదంలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఒకే విడతలో తక్షణమే చెల్లించాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో సంగారెడ్డిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జయరాజు మాట్లాడుతూ...మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్ వెంటనే అందించాలని, క్షతగాత్రులకు రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. డెత్ సర్టిఫికెట్ వస్తేనే నష్టపరిహారం అందజేస్తామని యాజమాన్యం అధికారులు చెప్పడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షలు కూడా బాధిత కార్మిక కుటుంబాలకు ఏ ఒక్కరికీ అందలేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సాయిలు, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు యాదగిరి, కృష్ణ, నాయకులు అశోక్, మహేశ్, దత్తు, శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెడల్స్ బహూకరణ

జిన్నారం (పటాన్‌చెరు): మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఫస్ట్ ఇయర్ వారికి సెకండియర్ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణకుమార్ మాట్లాడుతూ..గతేడాది కంటే ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య పెరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్, తహసీల్దార్ దేవదాస్, ఎస్ఐ హనుమంతు చేతుల మీదుగా ఆయా గ్రూపుల్లో టాపర్లకు మెడల్స్ అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెడల్స్ బహూకరిస్తున్న అధికారులు